నేడే బిఆర్ఎస్ ఆవిర్భావ సభ

- ఖమ్మం గులాబీమయం
- నూతన కలెక్టరేట్ వద్ద సిద్ధమైన సభా ప్రాంగణం
- నలుగురు సిఎంలు రానుండటంతో భారీ భద్రత
- నూతన కలెక్టరేట్‌తో పాటు 'కంటివెలుగు'కు శ్రీకారం
- 5200 మంది పోలీసులతో భద్రత కట్టుదిట్టం
- ఉదయం 6 గంటల నుంచే ట్రాఫిక్ మళ్లింపు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం గులాబీమయం అయింది. ఎటుచూసినా బిఆర్ఎస్ ఫ్లెక్సీలు, తోరణాలు, బ్యానర్లు దర్శనమిస్తున్నాయి. నగరంలో ప్రతి పది మీటర్లకు ఓ ఫ్లెక్సీ.. భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు. బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సభ సందర్భంగా ఖమ్మంలో బుధవారం భారీ బహిరంగసభ జరగబోతున్న విషయం తెలిసిందే. ఈ సభను ఐదు లక్షల మందితో నిర్వహించేందుకు ఆ పార్టీ నాయకత్వం భారీ ఏర్పాట్లు చేసింది. సభకు తెలంగాణ, కేరళ, ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కె చంద్రశేఖరరావు, పినరయ్ విజయన్, అరవింద్ కేజ్రీవాల్, భగవంత్‌మాన్ సింగ్‌తో పాటు యుపి మాజీ సిఎం అఖిలేష్‌యాదవ్, సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు హాజరుకానున్నారు. సభా ప్రాంగణంలో సంబంధిత సిఎంలు, ముఖ్యనాయకుల కటౌట్లతో అలంకరించారు. స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా నూతన కలెక్టరేట్‌ను ప్రారంభించనున్నారు. అదేవిధంగా కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు.

సిద్ధమైన సభాప్రాంగణం..

నూతన కలెక్టరేట్ ఎదుట ఇప్పటికే సభా ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. ప్రాంగణాన్ని స్థల అనుకూలతను బట్టి సెక్టార్లుగా విభజించారు. ఐదు వేలు మొదలు 50వేల వరకు ఒక్కో సెక్టార్ సామర్థ్యం ఉండేలా బారికేట్లు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రుల పర్యటన షెడ్యూల్‌ను బిఆర్ఎస్ పార్టీ విడుదల చేసింది. రెండు హెలికాప్టర్లలో సిఎంలు సభాస్థలికి చేరుకుంటారని నేతలు తెలిపారు. ఇటు సీఎంలు, అటు జాతీయస్థాయి నేతలు రానున్న దృష్ట్యా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 5,200 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నారు. మంగళవారం నుంచే ప్రధాన కూడళ్లు, ముఖ్య రహదారుల వెంట పోలీసులు మోహరించారు. సభా వేదికను పోలీసులు తమ అదుపులోకి తీసుకున్నారు. అనుమతి ఉన్న నాయకులు మినహా ఎవరినీ సభా వేదిక మీదకు ఎక్కకుండా భద్రతా చర్యలు చేపట్టారు. సభా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి హరీశ్‌రావుతో పాటు స్థానిక మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె కేశవరావు, మంత్రి మల్లారెడ్డి, లోక్‌సభా పక్ష నేత నామ నాగేశ్వరరావు, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వరరెడ్డి, తాతా మధు, కౌశిక్‌రెడ్డి తదితరులు తుది ఏర్పాట్లను పరిశీలించారు. మరోవైపు సమీకృత కార్యాలయాల భవన సముదాయాన్ని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్, సిపి విష్ణు ఎస్ వారియర్, నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి, అదనపు కలెక్టర్లు స్నేహలత మొగిలి, మధుసూదన్ తదితరులు మంత్రులతో కలిసి ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.

5,200 మందితో బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపు..

బుధవారం ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని సిపి విష్ణు ఎస్ వారియర్ ప్రకటించారు. అడిషనల్ డిజి విజయ్‌కుమార్, ఐజీలు షానవాజ్‌ఖాసీం, చంద్రశేఖర్‌రెడ్డి, వరంగల్ పోలీసు కమిషనర్ ఎవి రంగనాథ్, డీఐజీలు రమేష్‌నాయుడు, చౌహన్, ఖమ్మం సిపి, మహబూబాబాద్, కొత్తగూడెం ఎస్‌పిలు, పది మంది అడిషనల్ ఎస్‌పిలు, ఎసిపిలు 39, సిపిఐలు, ఆర్ఐలు 139, ఎస్ఐలు 409 మంది ఇలా మొత్తం 5,200 మంది పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. నగరం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. సూర్యాపేట నుంచి ఖమ్మం వచ్చే వాహనాలను కోదాడ మీదుగా విజయవాడ హైవేకు మళ్లిస్తున్నారు. వరంగల్ నుంచి వచ్చే వాహనాలను వరంగల్ ఎక్స్‌రోడ్ మీదుగా కోదాడ మార్గంలో తరలిస్తున్నారు. అలాగే వాహనాల పార్కింగ్ కోసం క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చారు. సుమారు 400 ఎకరాలను పార్కింగ్ కోసం కేటాయించారు. ఏరియాల వారీగా నంబర్లు ఇచ్చారు. మీడియా పాస్‌ల బాధ్యతను మీడియా కన్వినింగ్ కమిటీకి అప్పగించడంతో పాస్‌ల కోసం తంటాలు పడాల్సి వచ్చింది. అయినా పాస్‌లు సక్రమంగా అందకపోవడంతో పలువురు స్థానిక మీడియా ప్రతినిధులు సోషల్ మీడియా వేదికగా నిరసన వ్యక్తం చేశారు.

గుండాలను అరెస్ట్ చేయాలి

- కేసు పెట్టినా పట్టించుకోని పోలీసులను సస్పెండ్ చేయాలి
- మల్లికార్జున్‌పై దాడిని నిరసిస్తూ ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దళిత టీచర్ మల్లికార్జున్‌పై దాడులను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. కలెక్టర్ కార్యాలయంలో ఎఒ ప్రశాంత్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జంబిశెట్టి శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. దళిత టీచర్ మల్లికార్జున్‌ను బలవంతంగా గుడికి తీసుకెళ్లి బొట్టు పెట్టి అతని ఆత్మాభిమానాన్ని కించపరిచిన ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్, బిజెపి గుండాలపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టి అరెస్ట్ చేయాలని కోరారు. ఇదంతా పోలీసుల సమక్షంలో జరుగుతున్నప్పటికీ పట్టించుకోకుండా వ్యవహరించిన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. టీచర్‌పై జరిగిన ఈ దుర్మార్గపు చర్యను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక హిందూ ముస్లింల మధ్య విభేదాలు సృష్టిస్తూ మతోన్మాద చర్యలకు పాల్పడుతుందని అన్నారు. లౌకికవాదులు ప్రశ్నిస్తే గొంతు నొక్కే ప్రయత్నం చేస్తుందని అన్నారు. వీరిపై దేశద్రోహులుగా ముద్ర వేసి దేశం విడిచి పోవాలని బెదిరిస్తున్నారని అన్నారు. ఈ చర్యలను నిరసిస్తూ ప్రజాస్వామిక లౌకికవాదులు ఏకమై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అలాగే మల్లికార్జున్ టీచర్ ధైర్యాన్ని మెచ్చుకోవాలని అన్నారు. తనపై ఇంత దాడి జరుగుతున్నా, చంపుతామని బెదిరిస్తున్నప్పటికీ ధైర్యంగా ముందుకు వచ్చి నిలబడటం, తనలాంటి అవమానం ఇతరులకు జరగవద్దని భావించడం చాలా గొప్ప విషయమని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు రమేష్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి మల్యాల గోవర్ధన్, చక్రపాణి మోహన్, నన్నేసాబ్, డి కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యేశాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

1/70 చట్టాన్ని రద్దు చేయాలి

- సుప్రీం కోర్టులో పిటిషన్
- కేంద్ర ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలి
- తెలంగాణ గిరిజన సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత రాజ్యాంగం ఐదో షెడ్యూల్‌లో భాగంగా గిరిజనులకు కల్పించిన 1/70 చట్టాన్ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్రానికి చెందిన సూరెడ్డి రమణారెడ్డి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారనీ, దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగం కల్పించిన ఐదో షెడ్యూల్డ్ హక్కులను రద్దు చేసేందుకు కుట్రలు చేస్తున్నదని పేర్కొన్నారు.. ఒకే దేశం, ఒకే చట్టం, ఒకే భాష నినాదాలతో ముందుకు పోతోందని తెలిపారు. అందుకు ఆటంకమైన చట్టాలన్నింటిని రద్దు చేయాలని పూనుకున్నదని పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రాంతంలో స్థానిక గిరిజనులకు వంద శాతం విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న జిఒ నెంబర్ మూడుని న్యాయస్థానం ద్వారా రద్దు చేయించిందని తెలిపారు. అటవీ సంరక్షణ నియమాలు 2022 పేరుతో పెసా 'చట్టాన్ని రద్దు చేసేందుకు వచ్చే పార్లమెంట్‌లో చట్టం చేయబోతోందని పేర్కొన్నారు. బిజెపి మద్దతుదారులే 1/70 చట్టాన్ని రద్దు చేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారని తెలిపారు.

రెండు కోట్ల ఉద్యోగాల జాడెక్కడ?

- భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి ఇస్తానన్న రెండు కోట్ల ఉద్యోగాలు జాడ ఎక్కడని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండం గ్రామం బస్టాండ్ చౌరస్తాలో భారత ప్రజాతంత్ర యువజన సమైఖ్య (డివైఎఫ్ఐ), భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం భగత్‌సింగ్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భగత్‌సింగ్ చిత్రపటానికి గ్రామ సర్పంచ్ దశరథం నాయక్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోటా రమేష్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సమగ్రత, సమైక్యత కోసం, సమాన విద్యా, ఉపాధి అవకాశాల కోసం భగత్‌సింగ్ తన జీవితాన్ని బలిదానం చేశారని గుర్తు చేశారు. నేటి పాలకులు వాటిని తుంగలో తొక్కి కులమతాల పేరుతో రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. ఉద్యోగాలు కల్పించకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకొని యువత పోరాట మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి శివవర్మ, యుటిఎఫ్ సీనియర్ నాయకులు లక్ష్మణ్ నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం తారాసింగ్, తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి బాలపిరు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి భాస్కర్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ చంద్ర నాయక్,సేవ్య నాయక్, మత్స్య కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మక్కా మసీదులో ముకర్రమ్ జా భౌతికకాయం ఖననం

- చౌమల్లా ప్యాలెస్‌లో ప్రజల సందర్శనార్థం
- సిఎం కెసిఆర్ నివాళులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


ఎనిమిదో నిజాం నవాబు భర్కత్ అలీఖాన్ ముకర్రమ్ జా బహదూర్ భౌతికకాయాన్ని సిఎం కెసిఆర్ మంగళవారం సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన టర్కీలోని ఇస్తాంబుల్‌లో శనివారం రాత్రి కన్నుమూసిన విషయం తెలిసిందే. మంగళవారం భౌతికకాయాన్ని హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. చౌమహల్లా ప్యాలెస్‌లో నిజాం నవాబు భౌతికకాయాన్ని ఉంచారు. సిఎంతో పాటు డిజిపి అంజనీకుమార్ ముకర్రం ఝాకు నివాళులర్పించారు. ఇదిలా ఉండగా చివరి నిజాం ఉస్మాన్ అలీ ఖాన్ మనువడు ఆయన చివరి కోరిక మేరకు హైదరాబాద్‌లోని మక్కా మసీద్‌లో ఖననం చేసేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ప్యాలెస్‌లో భౌతికకాయాన్ని సందర్శనార్థం ఉంచారు. బుధవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నవాబు భౌతికకాయాన్ని చూసేందుకు అనుమతిచ్చారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఆయన అంతిమయాత్ర ప్రారంభమవుతుంది. మక్కా మసీదుకు చేరుకున్న తర్వాత నిజాం సమాధుల పక్కనే ముకర్రమ్ జా భౌతికకాయాన్ని ఖననం చేయనున్నారు. ఉస్మాన్ అలీ ఖాన్ కుమారుడు ఆజాం ఝా, టర్కీ చివరి సుల్తాన్ అబ్దుల్ మజీద్-2 కుమార్తె దురు షెహవర్ దంపతులకు 1933 అక్టోబర్ ఆరున ముకర్రం ఝా జన్మించారు. 1971 వరకు అధికారికంగా హైదరాబాద్ యువరాజుగా కొనసాగారు.


నిరసన చేస్తున్న భాషా పండితులు

భాషాపండిట్, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భాషా పండితులు, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేసి న్యాయం చేయాలని కోరుతూ తెలుగు, హిందీ, ఉర్దూ పండితులు, పిఇటిలు మంగళవారం సిద్దిపేట పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాలల్లో భాషా పండితులు పదో తరగతి వరకు బోధిస్తూ వెట్టిచాకిరీ చేస్తున్నారన్నారు. నూతనంగా నియామకమైన స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగుల కంటే కేడర్ తక్కువగా ఉండటంతో చిన్నచూపునకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చిన హామీకి కట్టుబడి పండిట్, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేసి, త్వరలో వెలువడనున్న పదోన్నతుల షెడ్యూల్లో భాషా పండితులు, పిఇటిలకు అవకాశం కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో అన్ని స్కూల్ అసిస్టెంట్ పోస్టుల మాదిరిగానే పండిట్, పిఇటి పోస్టులూ ఉండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాషా పండితులు, పిఇటిలు బద్దిరాజు, రఫీ, రాజలింగం, ఉండ్రాళ్ల రాజేశం, చంద్రకాంత్ గౌడ్, నరేష్, భైరారెడ్డి, ఉమా, రాజేశ్వర శర్మ, రమేష్, విజయ మోహన్ రాజు, కౌసల్య, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.


సాలూరి కోటిని సన్మానిస్తున్న వక్తలు

మనిషిని పతాక స్థాయిలో నిలిపిన సినారె

ప్రజాశక్తి - కల్చరల్

"తెలుగు సినీ సాహిత్యంలో నూతన పదాలను సృష్టించి భాషను సుసంపన్నం చేసిన సినారె. దేవుణ్ణి కాక మనిషి వైపే ఉంటాను,. మనిషే నా పతాక, మనిషే నా కవిత." అని సందేశమిచ్చిన సి నారాయణ రెడ్డి మహా కవి అని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ అన్నారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై వంశీ ఇంటర్నేషనల్ శుభోదయం గ్రూప్ నిర్వహణలో డాక్టర్ సి నారాయణ రెడ్డి సినీ గీత రచన ఆరంభించి 61 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా డాక్టర్ ఆళ్ల శ్రీనివాస రెడ్డి నెలకొల్పిన ఆళ్ల సినారె స్వర్ణ కంకణ ప్రదానోత్సవం సంగీత దర్శకుడు సాలూరి కోటికి సంగీత బంధురంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా డాక్టర్ రమణ పాల్గొని మాట్లాడుతూ విదేశాలలో వున్న శ్రీనివాస్ రెడ్డి భాషాభిమానం, సాహిత్యాభిమానంతో సినారె పేరిట స్వర్ణ కంకణం ఏర్పరిచి ఉత్తమ సంగీత దర్శకుడు కోటికి బహుకరించటం ముదావహం అన్నారు. అధ్యక్షత వహించిన డాక్టర్ ఆళ్ల శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. సినారే తన జన్మ దినం కవితా సంపుటి పుట్టిన రోజు కాగా అధిక భాగం తానే వాటిని ప్రచురించానని తెలిపారు. ఆర్‌డి బర్మన్, బప్పీ లహరి వంటి బాలీవుడ్ సంగీత దర్శకులకు గిటారిస్టుగా పనిచేసి తెలుగు సినిమాలకు దర్శకునిగా ఎఆర్ రహమాన్, తమన్ వంటి సంగీత దర్శకులను అందించిన కోటి ఉత్తమ వ్యక్తిత్వం నమ్రతకలవారని కొనియాడారు. స్వాగతం పలికిన వంశీ రామరాజు గతంలో సినారె అల్ల స్వర్ణ కంకణం జమునకు సిరివెన్నెల సీతారామశాస్త్రికి బహుకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శకులు కోదండరామిరెడ్డి, బి.గోపాల్, రేలంగి నరసింహ రావు, లక్ష్మీ తుమ్మల, వెనిగెళ్ల రాంబాబు శుభోదయం హరి వేణుగోపాల్, ప్రసాద్ తోట కూర పాల్గొన్నారు. కార్యక్రమానికి తొలుత అమెరికా గాయని శారద ఆకునూరి నిర్వహణలో బాల కామేశ్వరరావు తదితరులు మధురమైన పాటలు ఆలపించారు. కోటితో కలసి శారద పాడిన గువ్వ గోరింకాతో పాటకు ప్రేక్షకులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ సంస్థలను ప్రయివేటీకరిస్తే ఆందోళనే

- బిజెపి నాయకులను ఎయిర్‌పోర్టు బయటకు అడుగుపెట్టనీయం
- బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ సంస్థలను ప్రయివేటీకరిస్తే కేంద్ర నాయకత్వాన్ని, బిజెపి నాయకులను ఎయిర్‌పోర్టు బయట అడుగుపెట్టనీయమని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. హైదరాబాద్ కాచిగూడలోని అభినందన్ హోటల్లో బిసి జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బిసి యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజకుమార్ అధ్యక్షతన చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బిసిలకు 50 శాతం టిక్కెట్లు ఇవ్వాలని, పార్లమెంట్‌లో బిసి బిల్లు వెంటనే ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. విద్యా ఉద్యోగాల్లో బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం బిసి క్రిమిలేయర్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వాల మాదిరిగా దేశవ్యాప్తంగా బిసి గురుకులాలు, బిసి హాస్టల్ ఫీజు రియంబర్స్‌మెంట్ అమలు చేయాలని, ప్రయివేటు రంగాల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. హైకోర్టు సుప్రీంకోర్టు జడ్జీల నియామకాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బిసి కార్పొరేషన్‌లో పెండింగ్‌లో ఉన్న సబ్సిడీ రుణాలను విడుదల చేయాలన్నారు. సిఎం కెసిఆర్ గతంలో ఇచ్చిన వాగ్దానం మేరకు 119 నియోజకవర్గాల్లో బిసి రెసిడెన్షియల్ పాఠశాలలు కొత్తగా ఏర్పాటు చేయాలని అన్నారు. బిసిలకు పారిశ్రామిక పాలసీలో 50 శాతం వాటా ఇవ్వాలని, కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి రూ.రెండు లక్షల కోట్లతో ప్రత్యేక అభివృద్ధి పథకం ఏర్పాటు చేయాలని తెలిపారు. బిసి ప్రధాని ఉన్నా బిసిలకు న్యాయం చేయలేకపోయారని విమర్శించారు. ఫిబ్రవరి 9,10 తేదీల్లో పార్లమెంట్ భవనం ఎదుట భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది మెట్టు చంద్రశేఖర్, బిసి విద్యార్థి రాష్ట్ర అధ్యక్షులు అంజి, బిసి ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి బి శ్రీనివాస్, మహిళా నాయకురాలు శ్రీదేవి, నాయకులు నందగోపాల్, పి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణయ్య తదితరులు

కంపెనీలకు భూములు కట్టబెట్టే యత్నం

- మాస్టర్ ప్లాన్ రద్దు చేయాల్సిందే
- ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి డిమాండ్
- 20న విప్ ఇంటి ముట్టడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూ సేకరణ చట్టం-2013 ప్రకారం భూములు సేకరించేందుకు 80 శాతం మంది రైతులు అంగీకరించాల్సి ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం రకరకాల జోన్ల పేరుతో రైతులను ఇక్కట్లు పెట్టి వారి భూములు లాక్కొని కంపెనీలకు కట్టబెడుతోందని ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. దాంట్లో భాగంగానే కామారెడ్డి, జగిత్యాలలో మొదటి విడుతగా అమలు చేసేందుకు యత్నిస్తుందని చెప్పారు. కామారెడ్డి మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కామారెడ్డి జిల్లా పాతం రాజంపేట్‌లో ఏర్పాటుచేసిన సమావేశానికి సారంపల్లి మల్లారెడ్డి హాజరై మాట్లాడారు. మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయాలని, కంపెనీలు పెట్టేందుకు కామారెడ్డిలో తాము భూములు చూపిస్తామని చెప్పారు. భూములు రక్షించుకోవడం కోసం రైతులకు అండగా ఎఐకెఎస్ పోరాడుతోందని తెలిపారు. ఉద్యమాలను ఉధృతం చేస్తే ప్రభుత్వం దిగిరాక తప్పదని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతి రామ్ నాయక్, మల్లేష్, నర్సింలు, కమ్మరి సాయిలు, మధు, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

20న విప్ ఇంటి ముట్టడి

మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయకుంటే ఈ నెల 20వ తేదీన ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ ఇంటి ముట్టడికి రైతు ఐక్య కార్యాచరణ కమిటీ తీర్మానం చేసింది. మంగళవారమిక్కడ సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణపై పలు తీర్మానాలు చేశారు. గుంట భూమిని సైతం రైతులకు నష్టం కలిగించే ప్రసక్తే లేదని చెప్తున్న కలెక్టర్, కమిషనర్, ఎమ్మెల్యే మాట ప్రకారం ఈ నెల 19 వరకు మున్సిపల్ సర్వసభ్య సమావేశం పెట్టి మాస్టర్ ప్లాన్ రద్దుకు తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే 19వ తేదీ మూడు గంటల వరకు విలీన గ్రామాలకు చెందిన తొమ్మిదిమంది కౌన్సిలర్లు రైతులకు మద్దతుగా, మాస్టర్‌ప్లాన్‌కి వ్యతిరేకంగా రాజీనామా చేయాలని కోరారు. ఒక వేళ ఎవరైనా రాజీనామా చేయకపోతే వారిపై వచ్చే సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని, తమతో కలిసి వచ్చిన కౌన్సిలర్లతో కమిషనర్‌కు రాజీనామా ఇస్తామని అన్నారు.



విద్యార్థినీలకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న మంత్రి సబిత

చదువుల్లో బాలికలు వజ్రాల్లా వెలుగొందాలి

- విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- 1900 మంది విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు అందజేసిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాలికలు చదువుల్లో వజ్రాలు, రత్నాల్లా వెలుగొందాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. అప్పుడే భవిష్యత్తు చాలా బాగుంటుందన్నారు. మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ 1907 మంది పేద విద్యార్థినీలకు స్కాలర్‌షిప్‌లను ప్రకటించింది. ఈ స్కాలర్‌షిప్‌లను బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి విద్యార్థీనీలకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అమ్మాయిలకు మద్దతును ఇవ్వాలనే మలబార్ గోల్డ్ ఉద్దేశ్యాన్ని తాను అభినందిస్తున్నానని తెలిపారు. రాష్ట్రంలో ఒకప్పుడు 18 ఏళ్లలోపు వారికే పెళ్లిళ్లుజరిగేవని అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ కళ్యాణ లక్ష్మి పథకాన్ని తేవడం.. 18 ఏళ్లు పూర్తి అయిన వారికి మాత్రమే ఈ పథకాన్ని అమలు చేయడంతో అనేక మంది ఉన్నత చదువులకు దగ్గరయ్యారన్నారు. కళ్యాణ లక్ష్మి పథకం అమలు కావాలంటే ఆడ పిల్లలకు 18 ఏళు నిండాలని.. ఇంతలో వారికి విద్యాపై అవగాహన పెరిగి.. ఉన్నత విద్య చదువుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని.. తల్లిదండ్రులూ ఆ విధంగా ప్రోత్సాహాన్ని ఇస్తున్నారన్నారు. ఉస్మానియా, కాకతీయ యూనివర్శిటీల్లో 70 శాతంగా పైగా అమ్మాయిలు ఉండటమే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్యను అందించడానికి సిఎం కెసిఆర్ అనేక హాస్టళ్లను, రెసిడెన్సీయళ్లను అందుబాటులోకి తెచ్చారన్నారు. మలబార్ గోల్డ్ సోమాజిగూడ స్టోర్ హెడ్ అలీ రెజై, దిల్‌సుక్‌నగర్ స్టోర్ హెడ్ రదీష్‌లు మాట్లాడుతూ.. 1907 మంది విద్యార్థినీలకు ఒక్కొక్కరికీ రూ.8,000 నుంచి రూ.10,000 చొప్పున మొత్తం రూ.1,59,14,000 స్కాలర్‌షిప్‌లను ఇవ్వడం జరిగిందన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో మలబార్ గ్రూపు నిబద్ధతతకు ఇది నిదర్శనమన్నారు. తమ సంస్థకు వచ్చిన లాభాల్లో ఐదు శాతం ఇందుకోసం ఖర్చు చేస్తున్నామన్నారు.

తెలంగాణలో కన్నడీలకు రిజర్వేషన్లు కల్పించాలి

- బసవ ప్రభు స్వామి

ప్రజాశక్తి-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో కన్నడ మీడియం చదువుతున్న పిల్లలకు తదుపరి ఉన్నత విద్యకు రిజర్వేషన్ కల్పించాలని బసవకల్యాణ మహామనేని బసవప్రభు స్వామీజీ కోరారు. నగరంలోని ఉస్మానీయ యూనివర్సిటీ హాలులో కన్నడ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో తెలంగాణ కన్నడ విద్యార్థులకు ఏర్పాటు చేసిన కన్నడ మాధ్యమం అవార్డు ప్రదానోత్సవంలో అవార్డులను ఆయన ప్రదానం చేశారు. దక్షిణ భారతదేశంలోని సోదర భాషలు గొప్పవన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

- మాస్టర్‌ప్లాన్‌తో నష్టపోతున్నామని ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కామారెడ్డి మాస్టర్ ప్లాన్ రైతుల జీవితాలను చిన్నాభిన్నం చేస్తోంది. ఇప్పటికే సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన రైతు పయ్యావుల రాములు ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువకముందే మరొక రైతు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటన కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మర్రిపల్లి బాలకృష్ణ, సంతోష్ ఇద్దరు అన్నదమ్ములు. వీరికి సర్వే నంబర్ 89లో ఎకరం భూమి ఉంది. బాలకృష్ణకు ఇద్దరు ఆడపిల్లలు మిధున, మేఘన ఉన్నారు. ప్రస్తుతం వారు తాడ్వాయి సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. అయితే ఇద్దరు పిల్లలు డాక్టర్ చదువు కోసం ప్రయత్నిస్తున్నారు. దానికోసం తన భాగం భూమిని అమ్మడానికి ప్రయత్నించగా గతంలో రూ.70 లక్షలు పలికింది. ఇప్పుడు మాస్టర్‌ప్లాన్‌తో గ్రీన్‌జోన్‌లోకి తన భూమి రావడంతో రూ.20 లక్షలకు కూడా అడగడం లేదు. దాంతో తన పిల్లల భవిష్యత్తు అంధకారం అవుతుందని మనస్తాపం చెందిన బాలకృష్ణ గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. కుటుంబ సభ్యులు గమనించి ఆయన్ను వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు ఆస్పత్రికి వెళ్లి బాలకృష్ణను పరామర్శించారు. ఈ సందర్భంగా రైతు బాలకృష్ణ భార్య లక్ష్మీ మాట్లాడుతూ.. తమ భూమి మాస్టర్ ప్లాన్‌లో గ్రీన్ జోన్‌లో పోతుందని తెలిసి తన భర్త ఆవేదనకు గురయ్యాడన్నారు. నెల రోజులుగా రైతులతో కలిసి ఉద్యమంలో కూడా పాల్గొంటున్నారని తెలిపారు. తమ భూమి మాస్టర్ ప్లాన్‌లో పోకుండా చూడాలని ఆమె వేడుకున్నారు.

కొత్త 5జి గెలాక్సీ ఎ14 విడుదల



న్యూఢిల్లీ : సామ్‌సంగ్ తన 5జి స్మార్ట్‌ఫోన్ విభాగాన్ని విస్తరించింది. కొత్తగా గెలాక్సీ ఎ14 5జి, గెలాక్సీ ఎ23 5జి ఫోన్లను ఆవిష్కరించింది. మిడ్ సెగ్మెంట్ రేంజ్‌లో ఆవిష్కరించిన ఎ14 ప్రారంభ ధరను రూ.16,499గా ప్రకటించింది. 6జిబి, 128 జిబి వేరియంట్ ధరను రూ.18,999గా పేర్కొంది. ఎ23 5జి ప్రారంభ ధరను రూ.22,999గా నిర్ణయించింది. రెండు మోడళ్లు కూడా జనవరి 20 నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో లభిస్తాయని తెలిపింది. రెండు ఫోన్లను 50ఎంపి క్వాడ్ రేర్ కెమెరాతో ఆవిష్కరించింది.

రిపబ్లిక్ సేల్ ప్రారంభం

సామ్‌సంగ్ షాప్ యాప్, తమ స్టోర్లలో రిపబ్లిక్ సేల్‌ను ప్రారంభించినట్లు సామ్‌సంగ్ తెలిపింది. ఎంపిక చేసిన గెలాక్సీ స్మార్ట్‌ఫోన్లపై 61 శాతం, టివిలపై 56 శాతం, టాబ్లెట్లు, యాక్సిసరీస్‌పై 63 శాతం వరకు తగ్గింపును ఇస్తున్నట్లు తెలిపింది.

ల్యాప్‌టాప్స్‌పై 10,000 వరకు క్యాష్ బ్యాక్‌ను అందిస్తున్నట్లు పేర్కొంది. కొత్త సామ్‌సంగ్ యాప్ వినియోగదారులకు రూ.6,500 వరకు వెల్కం బెనిఫిట్స్ తగ్గింపును ఇస్తున్నట్లు తెలిపింది.

నేటి నుంచి ఐసిఇఆర్‌పి సదస్సు

ముంబయి : ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ అండ్ ఎగ్జిబిషన్ ఆన్ రీఇన్‌ఫోర్స్డ్ ప్లాస్టిక్ (ఐసిఇఆర్‌పి)-2023 సదస్సు జనవరి 18న ప్రారంభం కానుంది. ముంబయిలో జరగనున్న ఈ కాన్ఫరెన్స్ జనవరి 20న ముగియనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సదస్సులో ఇండియన్ కాంపోజిట్ పరిశ్రమ వాటాదారులంతా ఒకే వేదిక పైకి వస్తారన్నారు. 2027 నాటికి భారత కాంపోజిట్ పరిశ్రమ 2.01 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.16వేల కోట్లు)లకు చేరనుందని అంచనా. రాబోయే ఐదేళ్లలో అంతర్జాతీయ సరాసరి వద్ధిని అధిగమించనుందని ఆ పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

అబూదాబీ నైట్ రైడర్స్‌తో ఖిలాడిక్స్ ఒప్పందం

హైదరాబాద్ : అబుదాబీ నైట్ రైడర్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు స్పోర్ట్స్ ప్లాట్‌ఫామ్ ఖిలాడిక్స్ డాట్ కామ్ వెల్లడించింది. దీనిలో భాగంగా యుఎఇలో జరుగనున్న డిపిడబ్ల్యు ఐఎల్‌టి20 పోటీలకు ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరించనున్నట్లు పేర్కొంది. అదే విధంగా ఆ రైడర్ల బృందం సభ్యులకు తమ బ్రాండింగ్‌తో జెర్సీలను రూపొందించనున్నట్లు తెలిపింది. ఈ భాగస్వామ్యంతో అంతర్జాతీయంగా క్రికెట్ లీగ్‌తో ఖిలాడిక్స్ డాట్ కామ్ భాగస్వామ్యం ప్రారంభమయినట్లయ్యిందని పేర్కొంది.

మల్లికార్జున్‌పై అక్రమ కేసును ఉపసంహరించాలి

- హైదరాబాద్‌లో మహా ధర్నా
- డిజిపి, పోలీస్ ఉన్నతాధికారులకు మరోసారి వినతిపత్రాల సమర్పణ
- దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి
- 23న భావస్వేచ్ఛ ప్రకటన పరిరక్షణ ఆందోళనల్లో భాగస్వాములవుతాం
- యుఎస్‌పిసి రౌండ్‌టేబుల్ సమావేశంలో కార్యాచరణ



రౌడ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మతోన్మాద మూకల దాడికి గురైన నిజామాబాద్ కోటగిరి హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు మల్లికార్జున్ కు న్యాయం చేయాలనే డిమాండ్‌తో హైదరాబాద్ మహా ధర్నా నిర్వహించనున్నట్టు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి) తెలిపింది. మల్లికార్జున్‌పై దాడిని ఖండిస్తూ యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ సభ్యులు కె జంగయ్య, వై అశోక్ కుమార్, ఎం సోమయ్య, యు పోచయ్య, సయ్యద్ షౌకత్ అలీ, ఎన్ యాదగిరి, దూడ రాజనర్సుబాబు, ఎస్ హరికిషన్, బి కొండయ్య అధ్యక్ష వర్గంగా సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం, సిపిఐ (ఎంఎల్ -న్యూడెమొక్రసీ), సిపిఐ (ఎంఎల్ -ప్రజాపంథా) నాయకులతో పాటు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇదివరకే మల్లికార్జున్‌పై పెట్టిన బూటకపు కేసులను ఉపసంహరించాలని, దాడికి పాల్పడిన నిందితులను అరెస్టు చేయాలని డిజిపితో పాటు సంబంధిత పోలీస్ అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ, మరో సారి కలిసి ఒత్తిడి పెంచాలని నిర్ణయించారు. అదే విధంగా భావస్వేచ్ఛ ప్రకటనా పరిరక్షణ కోసం ఏర్పడిన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 23న చేపట్టనున్న ఆందోళనల్లో భాగస్వాములు కానున్నట్టు యుఎస్‌పిసి నాయకులు వెల్లడించారు. ఉపాధ్యాయులు స్వేచ్ఛగా పాఠాలు బోధించే వాతావరణం కల్పించాలని సమావేశం డిమాండ్ చేసింది. శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీస్తున్న అరాచక శక్తులను నిలువరించేందుకు చర్యలు చేపట్టాలని కోరింది. గణేష్ చందా ఇవ్వలేదనే కోపంతో మల్లికార్జున్‌ను వ్యక్తిగతంగానూ, కులం పేరుతో అవమానించారని విమర్శించింది. మొత్తం ఘటనను పోలీసులు అడ్డుకోకపోగా అరాచక శక్తులకు వత్తాసు పలకడం పట్ల విచారం వెలిబుచ్చింది. ఘటన జరిగి 15 రోజులు గడుస్తున్నా నిందితులను ఇంకా అరెస్ట్ చేయకపోవడమేంటని ప్రశ్నించింది. ప్రజాస్వామ్యవాదులు, సామాజికవాదులు ఇలాంటివి అడ్డుకోకపోతే పౌరులకు రాజ్యాంగ స్వేచ్ఛ లేకుండా పోయే ప్రమాదముందని హెచ్చరించింది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మతం ముసుగులో చెలరేగిపోతున్న అరాచకశక్తులను నిర్దాక్షిణ్యంగా అణచివేయాలని డిమాండ్ చేసింది. ఉపాధ్యాయ సంఘాలు, సామాజిక పౌర సంఘాలు, కార్మిక సంఘాలు కలిసి నిందితులను శిక్షించేవరకు ఐక్యంగా ఉద్యమించాలని సమావేశంలో నిర్ణయించారు.

పోలీసుల సమక్షంలో దాడి చేశారు....మల్లికార్జున్

గణేష్ చందా ఇవ్వలేదని.. ద్వేషం పెంచుకుని దాడి చేశారని బాధితుడు మల్లికార్జున్ తెలిపారు. తాను పాఠ్యాంశంలో ఉన్న భాగ్యోదయంలో భాగ్యరెడ్డి వర్మకు సంబంధించిన పాఠాన్ని పిల్లలకు బోధించాననీ, అందులో ఉన్న అంశాల మేరకు తాను మూఢ నమ్మకాలపై భాగ్యరెడ్డి వర్మ చేసిన పనులను వివరించానని తెలిపారు. దానితో తనపై మరింత కోపాన్ని పెంచుకుని ఈ నెల మొదట్లో తనపై పాఠశాల ఆవరణలోనే దాడికి తెగబడ్డారని చెప్పారు. అక్కడ్నుంచి బలవంతంగా దేవాలయానికి తీసుకెళ్లి, భజన చేయించి, బొట్టు పెట్టించి క్షమాపణ చెప్పించుకున్నారని తెలిపారు. కులం పేరుతో దూషిస్తూ, మతం మారుతారంటూ దుర్భాషలాడారని తెలిపారు.

సిపిఎం మీ వెంట...డిజి నర్సింహారావు

వృత్తి పరిరక్షణ కోసం ఉపాధ్యాయులు చేసే ఉద్యమాలకు సిపిఎం అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు తెలిపారు. మూకల దాడిని ఎదురొడ్డి బోధన చేస్తున్న మల్లికార్జున్‌కు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుల పోరాటంలో తల్లిదండ్రులు, విద్యార్థులతో పాటు ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. న్యాయపోరాటం ఏ విధంగా చేయాలనే దానిపై ఆలోచించాలని కోరారు.

మనువాదాన్ని తరిమికొట్టాలి...అలుగుబెల్లి నర్సిరెడ్డి

బడిలోకి వచ్చిన మనవాదాన్ని తరిమికొట్టాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మల్లికార్జున్‌కు సహకారంగా, ఉపాధ్యాయ ఉద్యమంలో తానుంటానని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ (ఎంఎల్-న్యూడెమోక్రసీ) రాష్ట్ర కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్- న్యూడెమోక్రసీ) కార్యదర్శివర్గ సభ్యులు జె.వి.చలపతిరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు, వీక్షణం వేణుగోపాల్, ప్రొఫెసర్ కాశీం, స్వేచ్ఛ జెఎసి, విజ్ఞాన దర్శిని, జన విజ్ఞాన వేదిక, రైతు సంఘం, పిఒడబ్ల్యు, ఐఎఫ్ టియు, ఐఎఫ్ టియు, కెఎన్ పిఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాదములతో శారీరక దృఢత్వం

ప్రజాశక్తి-హైదరాబాద్



బాదములు తినడం వల్ల మజిల్ రికవరీ కావడంతో పాటుగా వ్యాయామాల వల్ల కలిగే నీరసం తగ్గుతుందని ఓ అధ్యయనంలో తేలింది. ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా మద్దతుతో అమెరికాలోని ప్రొఫెసర్ డేవిడ్ సీ నీమాన్ బాదములపై పరిశోధన చేశారని ఆ సంస్థ పేర్కొంది. వ్యాయమాలు చేసేవారు బాదముల కారణంగా అలసట మరియు ఆందోళన తగ్గి, రికవరీ సమయంలో లెగ్, లోయర్ బ్యాక్ బలమూ పెరుగుతుందని డేవిడ్ పేర్కొన్నారు. బాదములను ఖచ్చితంగా ఆటల న్యూటిషన్‌లో భాగం చేసుకోవాలి. దీనిద్వారా వ్యాయామాల వల్ల కలిగే సమస్యలనుంచి ప్రజలు త్వరగా కోలుకుంటారు" అని డాక్టర్ నీమాన్ అన్నారు.

ఇన్ఫెక్షన్ వల్లే బాలింతల మృతి

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో దారుణాలపై ఉన్నతస్థాయి కమిటీ వేయాలి
- టిడిపి అధ్యక్షులు కాసాని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శస్త్ర చికిత్సకు ఉపయోగించే కిట్లకు స్టెఫలో కొకస్ బ్యాక్టీరియా వ్యాపించడం వల్లే ఇటీవల మలక్‌పేట్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇద్దరు బాలింతల మృతి చెందినట్టు విచారణ కమిటీ ప్రాథమిక నివేదికలో నిగ్గు తేలడం బిఆర్ఎస్ ప్రభుత్వ అధ్వాన్న పనితీరుకు నిదర్శనమని టిడిపి అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ విమర్శించారు. అదే రోజు మరో 18 మందికి డెలివరీ అయ్యాక ఇన్ఫెక్షన్ సోకడంతో వారిని మెరుగైన చికిత్స కోసం వైద్యులు నిమ్స్‌కు తరలించారని, ఇందులో ఇద్దరు మహిళల కిడ్నీలకు ఇన్ఫెక్షన్ సోకి దయాలిసిస్ జరుగుతున్నదని చెప్పారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆస్పత్రిలో నలుగురు బాలింతలు, పేట్ల బురుజు ఆసుపత్రిలో మరో మహిళ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ సందర్భంగా ఇలాంటి ఇన్ఫెక్షన్ కారణంగా దుర్మరణం చెందినా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడకపోవడం దారుణమన్నారు.

బాధిత కుటుంబాలకు రూ. 50 లక్షల పరిహారం అందజేయాలని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం అలసత్వాన్ని వీడి ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించేందుకు వెంటనే అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్లలో అత్యాధునిక పరికరాలను, మెరుగైన వసతులను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని కోరారు. దారుణాలపై ప్రత్యేకంగా కమిటీ వేసి విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

మనువాదంపై ఐక్యపోరాటమే రోహిత్ వేములకు నివాళి

- కెవిపిఎస్ ఆధ్వర్యంలో రోహిత్ వేముల ఏడో వర్థంతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రోహిత్ ఫోటోకు నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు

మనువాదంపై విశాలఐక్య పోరాటమే ఆయనకు నివాళి అని పలువురు వక్తలు తెలిపారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో రోహిత్ వేముల ఏడో వర్ధంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిత్ చిత్రపటానికి కెవిపిఎస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు టి సాగర్, బొజ్జ బిక్షమయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో దళిత విద్యార్థులను ఉన్నత చదువుల నుండి దూరం చేయడానికి ఆర్ఎస్ఎస్ బిజెపి ప్రభుత్వం కుట్ర చేసిందని తెలిపారు. యూనివర్సిటీలోని దళిత విద్యార్థులకు రావాల్సిన ఫెలోషిప్పులను వైస్ ఛాన్సలర్ నిలిపివేశారని దానిని నిరసిస్తూ వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టారని పేర్కొన్నారు. యూనివర్సిటీలలో భావప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో దళిత విద్యార్థుల పట్ల వివక్షతపాటిస్తుందని తెలిపారు. రోహిత్ వేముల పోరాట స్ఫూర్తితో కాషాయపు విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు, డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్, అంబేద్కరిస్ట్ డాక్టర్ మంచాల మహేశ్వర్, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు టి సుబ్బారావు ఎం కృపాసాగర్, రాణా ప్రతాప్, ఇందిర, ఉమా, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



అన్నమయ్య పద సుమార్చనం రికార్డ్

ప్రజాశక్తి - కల్చరల్

వాగ్గేయకారుడు అన్నమాచార్య కీర్తనలు స్వర రాగ లయ బద్ధంగా ఆలపించి పది, పన్నెండేళ్ల బాలలు రికార్డుకెక్కారు. శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై అన్నమయ్య కళా సమితి నిర్వహణలో గురువు సుమలత సారథ్యంలో 30నిమిషాల్లో 30మంది బాలలు 30 రాగాలలో 30 కీర్తనలు ఆలపించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సంగీత కళాకారుడు జివి ప్రభాకర్ పాల్గొని మాట్లాడుతూ.. పిల్లలు అందరిలో సంగీత పరిజ్ఞానం ఉందని అన్నారు.

గురువు సుమలత సంగీత శిక్షణలో కృషిని అభినందించారు. పురుషోత్తమాచార్యులు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్న వేదికపై ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి బింగి నరేంద్ర వండర్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో దీన్ని నమోదు చేశారు. 27 మంది బాలలు ప్రత్యక్షంగాను ఏడుగురు బాలలు ఆన్ లైన్‌లోను పాల్గొన్నారు.

హాస్టల్ సిబ్బందికి జిఓ 60 వర్తింపచేయాలి

- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి
- డైరక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మోడల్ హాస్టల్ సిబ్బందికి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జిఓ 60 వర్తింప చేయకపోవడం, 24 గంటలు హాస్టల్లో ఉండి పని చేయాలని ఒత్తిడి చేస్తుండడంతో వారు తీవ్రమైన మానసిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకే అవరణం, ఒకే రకమైన పని చేస్తున్న సిబ్బందికి వేర్వేరు జీతాలు, వేర్వేరు జిఒలు అమలు చేయడం దుర్మార్గం. జిఓ 60 తక్షణమే అమలు చేయాలని తెలంగాణ మోడల్ స్కూల్ హాస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. మంగళవారం ఆ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ ఎడ్ల రమేష్, నాయకులు సంతోష, సుజాత, రజిత, సునీత, సరోజన, లావణ్య, వందన తదితరుల నేతృత్వంలో సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీనివాస్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె.వెంకటేష్ మాట్లాడుతూ 'తెలంగాణా రాష్ట్ర మోడల్ స్కూల్, హాస్టల్స్‌లో బోధనేతర సిబ్బంది అతి తక్కువ వేతనాలతో గత తొమ్మిదేండ్లుగా పని చేస్తున్నారు. ఇదే హాస్టల్ అవరణలో స్కూల్ నాన్ టీచింగ్‌కి తెలంగాణ ప్రభుత్వం జిఓ 60 అమలు చేస్తున్నారు. కానీ హాస్టల్ సిబ్బందికి అమలు చేయకపోవటం అన్యాయం. సర్వ శిక్ష అభియాన్ పథకంలో ఉద్యోగులకు వర్తించే ప్రతి జిఓ, సర్క్యులర్ వీరికి అమలు చేయాలి. కెజిబివిల్లో అమలు చేస్తున్న జాబ్‌చార్ట్, సెలవులు అమలు చేయాలి" అని డిమాండ్ చేశారు. "మోడల్ స్కూల్ తరహాలో జిఓ 60 హాస్టల్ కేర్ టేకర్లకు రూ.22,750, ఎఎన్ఎంలకు రూ.19,500, వాచ్‌మెన్, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, స్కావెంజర్‌లకి రూ.15,600 ఇవ్వాలి. జాబ్ చార్ట్ అమలు చేయాలి. 24 గంటల పని విధానం రద్దు చేయాలి. జిఓ 117 ఎరియార్స్ వెంటనే ఇవ్వాలి. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలి. కెజిబివి ఎస్ఒలను తొలగించి కేర్ టేకర్లను వార్డెన్లుగా నియమించాలి. ఎఎన్ఎంలకు ప్రభుత్వ స్టాఫ్ నర్సుల రిక్రూట్‌మెంట్ జిఓ 16లో వెయిటేజీ ఇవ్వాలి. హాస్టల్ సిబ్బందికి ఫర్నిచర్, ఫోన్ సౌకర్యం కల్పించాలి. పిల్లలకు సరిపడినంతగా మందులు ఎఎన్ఎంలకు సరఫరా చేయాలని..."ఆయన కోరారు. లేనిపక్షంలో రాబోయే అసెంబ్లీ సమావేశాల సమయంలో చలో హైదరాబాద్ నిర్వహించి తమ సత్తా చూపిస్తామని హెచ్చరించారు.

ఉద్యోగుల క్యాలండర్‌ను అవిష్కరించిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్, గోడప్రతులను మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి సబితా ఇంద్రారెడ్డి అవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లతో కూడిన షెడ్యూల్ విడుదల చేయడం పట్ల ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేసింది. సుమారు 9,700మంది ఉపాధ్యాయలకు ప్రమోషన్లు, 40 వేల మంది వరకు ఉపాధ్యాయ బదిలీలు చేపట్టడం ఉపాధ్యాయ లోకానికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాదవ్ వెంకట్రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూదరాజనర్సుబాబు కార్యక్రమంలో ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పోటు రంగారావు

పేరు మారితే సరిపోదు.. సరికొత్త విధానాలుండాలి

- సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ప్రజాశక్తి- ఖమ్మం

టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా పేరు మారిస్తే సరిపోదని.. సరికొత్త విధానాలుండాలని సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బిజెపి లాంటి మరో జాతీయ పార్టీగా బిఆర్ఎస్ ఆవిర్భవిస్తే దేశానికి ఏమంత ప్రయోజనం ఉండదని, మిలిగిన పార్టీల లాగానే అదొక పార్లమెంటరీ పార్టీ అవుతుందన్నారు. మతోన్మాదం, నిరంకుశత్వంతో దేశాన్ని ఫాసిస్టు ప్రమాదంలోకి తీసుకపోతున్న మతోన్మాద పాలకుల పాలనా నేపథ్యంలో నేడు దానికి వ్యతిరేకంగా బలమైన ప్రతిపక్షాల ఐక్యత ఎంతో దేశానికి అవసరమని తెలిపారు. అయితే ఎనిమిదేళ్ల టిఆర్ఎస్ పాలనలో కొన్ని సంస్కరణలు, పథకాల అమలు జరిగింది గానీ, ప్రజాస్వామిక హక్కుల విషయంలో, నిరుద్యోగం, నియామకాలు చేపట్టడంలో, కౌలు రైతులు, రైతుల ఆత్మహత్యలు ఆపడంలో విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు, విద్యా, వైద్యం, విద్యార్థులు, గిరిజనులు, దళితులు, బడుగువర్గాల ఆశయం నెరవేర్చడంలో సఫలం కాలేదన్నారు. ఈ స్థితిలో బిఆర్ఎస్ ఏర్పాటుపై అనేక ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయని, నిన్నటి దాకా బిజెపికి పార్లమెంట్‌లో జిఎస్‌టి, నోట్ల రద్దు, 370 ఆర్టికల్, పౌరసత్వ చట్టం లాంటి ఎన్నో ప్రజా వ్యతిరేక, దేశ వ్యతిరేక చట్టాల్లో టిఆర్ఎస్ భాగస్వామి అయిందని, ఇప్పుడు ఆకస్మాత్తుగా ఘర్షణ పడుతుందని, కేంద్ర ప్రభుత్వం నిరంకుశత్వం మీద జరిగే ఈ ఘర్షణ నికరంగా ఉండాలని ఆశిస్తున్నామన్నారు. ఎన్నికల కోసమే ఈ ఘర్షణ కాకుండా, నిజమైన రాష్ట్రాల హక్కుల సాధనకు నిలబడాలని కోరుతున్నామని చెప్పారు. అలానే ఎన్నికల ముందు కాంగ్రెసేతర ప్రతిపక్షాల ఐక్యత అంటూ బిజెపికి పరోక్షంగా లాభం చేకూర్చే 'బి' జట్టుగా మారవద్దని సూచిస్తున్నామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, జి రామయ్య, సివై.పుల్లయ్య, శివలింగం, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో కెటిఆర్ దిట్ట

- ప్రపంచ ఇన్‌ఫ్లూయన్సర్స్ జాబితాలో చోటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మున్సిపల్ శాఖ మంత్రి, బిఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు మంత్రి కెటిఆర్‌కు అరుదైన ఘనత దక్కింది. ప్రపంచంలోనే టాప్ సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయన్సర్స్ జాబితాలో చోటు దక్కించుకున్నారు. వరల్డ్ టాప్ 30 ఇన్‌ఫ్లూయన్సర్స్ జాబితాలో మన దేశం నుంచి ఇద్దరు యువనేతలకు మాత్రమే చోటు దక్కడం విశేషం. అందులో ఒకరు మంత్రి కెటిఆర్ కాగా, మరొకరు ఎంపి రాఘవ్ చద్దా. అయితే ఈ జాబితాలో ఎంపి కంటే మంత్రి కెటిఆర్ ముందు వరుసలో నిలబడి సత్తా చాటారు. అటు అఫిషియల్, ఇటు పర్సనల్ అకౌంట్... రెండింటిలోనూ మంత్రి కెటిఆర్ అగ్రస్థానంలో నిలిచారు. ఈ జాబితాలో మంత్రి కెటిఆర్ 12వ స్థానాన్ని దక్కించుకున్నారు. రాఘవ్ చద్దా 23వ స్థానంలో నిలిచారు. కాగా, తెలంగాణ ఐటి శాఖకు చెందిన అఫిషియల్ ట్విట్టర్ అకౌంట్ 22వ స్థానాన్ని దక్కించుకుంది. ఐటి శాఖ మంత్రిగా ఆ రంగం పురోభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి కెటిఆర్ సోషల్ మీడియాలోనూ చాలా చురుగ్గా ఉంటారు.

పిల్లలకు ప్రేమా, ఆప్యాతలు ముఖ్యం : హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిల్లలకు తల్లిదండ్రుల ప్రేమే కాకుండా.. నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యల అభిమానం, ఆప్యాయత, ప్రేమ ఎంతో ముఖ్యమని హైకోర్టు స్పష్టం చేసింది. వారి వాత్సల్యం పిల్లల ఎదుగుదలకు దోహదం చేస్తుందని తెలిపింది. పిల్లల సంరక్షణ అంటే డబ్బు మాత్రమే కాదంది. పలు దృక్కోణాల్లో చూడాలని ఓ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు తీర్పు చెప్పింది. మొదటి భార్య (ఓ చిన్నారి తల్లి) మరణించడంతో నల్లగొండకు చెందిన ఓ వ్యక్తి రెండో వివాహం చేసుకున్నాడు. ఆ చిన్నారి ప్రస్తుతం తండ్రి వద్దే ఉంటోంది. చిన్నారిని చూసేందుకు అనుమతివ్వాలని అమ్మమ్మ వినతిని ఆ జిల్లా కోర్టు తిరస్కరించడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మనమరాలిని వారంలో రెండు గంటలపాటు చూసేందుకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లలిత అనుమతి ఇచ్చారు. అల్లుడు, అత్తల మధ్య వివాదాలు పిల్లల మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపకూడదని అన్నారు. అమ్మమ్మ తన మనవరాలిని వారానికి ఒకసారి కలవడానికి అనుమతివ్వాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.

మతోన్మాదుల దుశ్చర్యలను ఖండిద్దాం

- సిఐటియు నిరసన ర్యాలీ
- కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు, నిరసనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామబాద్ జిల్లా కోటగిరిలో దళిత టీచర్ మల్లికార్జున్‌ను కులం పేరుతో దూషిస్తూ, గ్రామంలో ఊరేగిస్తూ అనాగరిక చర్యలకు పాల్పడిన ఆర్ఎస్ఎస్, బిజెపి మతోన్మాద దుండగులు చేసిన దుశ్చర్యలను ఖండించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించి, సామూహిక వినతి పత్రాలను అందించారు. అందులో భాగంగా హైదరాబాద్‌లో నాబార్డు బ్యాంక్ నుంచి ప్రదర్శన నిర్వహించి, ఆర్‌టిసి క్రాస్ రోడ్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. నాలుగు నెలల కిందట మల్లిఖార్జున్ అనే టీచర్ వినాయక చవితికి చందా ఇవ్వలేదనే కక్షతో బిజెపి, ఆర్ఎస్ఎస్ మతోన్మాదులు ఈ ఘోరానికి ఒడిగట్టారని, మల్లిఖార్జున్‌ను అత్యంత అమానుషంగా కించపర్చారన్నారు. బడి నుంచి గుడి వరకు బలవంతంగా మెడలు పట్టి కొట్టుకుంటూ లాక్కెళ్లి జైశ్రీరామ్ అనాలని ఒత్తిడి చేస్తూ, అతనికి బొట్టు పెట్టారని తెలిపారు. కులం పేరుతో దూషించి తీవ్రమైన పరుష పదజాలాలతో హేళన చేయడం దుర్మార్గమన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో పురోభివృద్ధి సాధించినప్పటికీ సాటి మనిషిని, మనిషిలాగా చూడలేని దుర్మార్గపు స్థితి బిజెపి పాలనలో సర్వసాధారణమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలగుడు భాస్కర్ మాట్లాడుతూ.. బిజెపి అధికారంలోకి వచ్చాక దళితులు, గిరిజనులు, మైనార్టీలే లక్ష్యంగా దాడులకు పాల్పడుతున్నదని, మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఊనా పట్టణంలో ఆవు మాంసం వలుస్తున్నారన్న నెపంతో నలుగురు దళిత యువకులను తమ కారుకి కట్టి ఈడ్చుకుంటూ తీసుకెళ్లారని, ఒక దళితుడు గుర్రం ఎక్కాడని కిందపడేసి కొట్టి చంపారని, యుపిలో ఓ దళిత యువతిని హత్రస్‌లో సామూహిక లైంగికదాడి చేసి, నాలుక కోసి, నడుములు విరిచినా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు తీసుకోలేదన్నారు. హాస్పిటల్‌లో బాధితురాలు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణిస్తే కనీసం ఆ శవాన్ని కూడా కుటుంబానికి ఇవ్వలేదని, ఇలాంటి దారుణాలు బిజెపి పాలిత రాష్ట్రాల్లో మరెన్నో జరుగుతున్నాయని గుర్తుచేశారు. వీటన్నింటిలో భాగంగానే కోటగిరి స్కూల్ టీచర్ మల్లిఖార్జున్‌పై దాడి జరిగిందన్నారు. తెలంగాణలో 70 కుల దురహంకార హత్యలు జరిగాయని, మంథని మధుకర్, ఆంబోజి నరేష్, పెరుమాండ్ల ప్రణయ్ వంటి హత్యలు రాష్ట్రాన్ని కుదిపేశాయన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ(విడిసిల) పేరుతో సాంఘిక బహిష్కరణలు జరుగుతున్నాయని అన్నారు. ఇలాంటి ఘటనల పట్ల బిఆర్ఎస్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, దాడికి పాల్పడిన దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.రమ, భూపాల్, రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేష్, ఎం.వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, పి.సుధాకర్, పి.సునీత, ప్రసాద్, హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్షులు జె.కుమార్, కోశాధికారి ఆర్.వాణి, సిటీ నాయకులు రాములు, సత్తయ్య, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎఒ ప్రశాంత్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జంబిశెట్టి శంకర్ గౌడ్, సిఐటియు ఉపాధ్యక్షులు రమేష్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి మల్యాల గోవర్ధన్, చక్రపాణి మోహన్, నన్నేసాబ్, డి. కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యేశాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.